సాక్షి నంద్యాల

సోమవారం । 21 । జూలై । 2025



నవోదయంలో అ'పూర్వ' సేవలు

బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూత ఇస్తున్నారు. అల్యూమినియం వెల్ఫేర్ అండ్ ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 8లో▸



కుక్కను తప్పించబోయి..

కుక్కను తప్పించబోయి కౌతాళం సమీపంలోని ఎల్లెల్సీలోకి కారు దూసుకెళ్లింది. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.03
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:79.900
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:38,079
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:39,009

సామాన్యులకు స్మార్ట్ షాక్!

- జిల్లాలో ఇప్పటికే 70,355 స్మార్ట్ మీటర్ల బిగింపు
- మీటరు ధర రూ.9వేలు వాయిదాల్లో చెల్లించాల్సిందే
- పనిచేసేది ఆరేళ్లు.. ఆ తర్వాత మళ్లీ కొనాల్సిందే!
- రోజుకు నాలుగైదు సార్లు రీడింగ్.. లోడ్‌ను బట్టి చార్జీలు
- అడ్డుగోలుగా పెరిగిపోయిన విద్యుత్ బిల్లులు
- 'స్మార్ట్‌మీటర్లు మా కొద్దు' అంటూ ఇళ్లకు పోస్టర్లు అతికించుకుంటున్న ప్రజలు

'విద్యుత్ బిల్లులు పెంచం.. స్మార్ట్ మీటర్లు అసలే ఉండవు.. కరెంట్ చార్జీలను తగ్గిస్తాం' అంటూ ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. సర్దుబాటు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అదనపు చార్జీలు వేస్తోంది. ట్రూ అప్ చార్జీల పేరుతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. అంతేకాకుండా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం అయ్యింది. రోజుకు నాలుగైదు సార్లు రీడింగ్ తీసుకోవడం .. లోడ్‌ను బట్టి చార్జీలు వేయడం.. స్మార్ట్ మీటర్ ధర భరించాల్సి ఉండడం.. ఇంకా ఎన్నో కారణాలతో సామాన్యులు 'షాక్'కు గురవుతున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్' అంటూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు విస్తృత ప్రచారం చేశారు. సంపద సృష్టించి హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా సామాన్యులకు 'స్మార్ట్' షాక్ ఇస్తున్నారని ఆరోపణలను మూటగట్టుకున్నారు. ఇంటింటికీ స్మార్ట్ మీటర్లు బిగిస్తూ సంపద సృష్టిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

సాంకే'తికమక'

స్మార్ట్ మీటర్లు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు పెనుభారం కానున్నాయి. ఇప్పటికే వ్యాపార, వాణిజ్య సముదాయాలకు బిగించిన స్మార్ట్ మీటర్లతో ఆ వర్గాలు గగ్గోలు పెడుతున్నాయి. ఇప్పుడు ఆవంతు గృహ వినియోగదారులకు వచ్చింది. రానున్న రోజుల్లో కష్టార్జితం మొత్తం స్మార్ట్‌మీటర్ల ద్వారా వచ్చే విద్యుత్ బిల్లులకే సరిపోయే ప్రమాదం ఏర్పడుతోంది. సామాన్య, మధ్య తరగతి కుటుంబీకులు బతకడం ఇక కష్టమే! అన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఆదాయాన్ని పిండుకోవడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్ మీటర్లలో సాంకేతికత మార్పులు చేసినట్లు స్పష్టమవుతోంది. దీంతో స్మార్ట్ మీటర్ల వద్దు బాబోయ్ అంటూ ప్రజలు గొంతెత్తుతున్నా పట్టించుకోవడం లేదు. ఇంటి పోస్టర్లు అతికించుకుంటున్నా స్పందించడం లేదు.



స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ పోస్టర్లు చూపుతున్న కర్నూలు ప్రజలు

'షాక్' ఇచ్చారు ఇలా..



- నంద్యాల జిల్లాలో ముందుగా నాన్ అగ్రికల్చర్ కనెక్ష్(డీటీఆర్), ప్రభుత్వ సర్వీస్‌లు, ఇండస్ట్రియల్, కమర్షియల్ కనెక్షన్‌లకు విద్యుత్ శాఖ స్మార్ట్ మీటర్లు బిగించింది. 33కేవీ ఫీడర్లు, 11 కేవీ ఫీడర్లకు స్మార్ట్ మీటర్లు బిగించలేదు.
- కొద్ది రోజులుగా 200 యూనిట్లు పైబడి విద్యుత్ వినియోగిస్తున్న గృహ కనెక్షన్‌లకు కూడా బిగిస్తున్నారు.
- మొత్తం 6,51,479 స్మార్ట్ మీటర్లు బిగించాలని తలపెట్టగా.. ఇప్పటికే 68,583 బిగించారు.
- 200 యూనిట్ల పైబడి వినియోగం ఉన్న ఇళ్లకు ఇప్పటి వరకు 4,219 స్మార్ట్ మీటర్లు బిగించారు.
- నంద్యాల డివిజన్‌లో 38,782, ఆత్మకూరు డివిజన్‌లో 11,507, డోన్ డివిజన్‌లో 18,294 స్మార్ట్ మీటర్లు బిగించారు.

ఇలా చేయవచ్చు..

- స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వినియోగదారులు వ్యతిరేకించవచ్చు.
- మీటర్లు వద్దని చెబుతున్నా...బిగించడానికి ప్రయత్నిస్తే 100 కాల్ చేసి పోలీసుల దృష్టికి తీసుకపోవచ్చు.
- ఇళ్లకు, షాపులకు బిగించడానికి వస్తే వద్దని ధైర్యంగా చెప్పవచ్చు.
- అనుమతి లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించే అధికారం విద్యుత్ శాఖకు లేదు.

లక్ష్యం అ'ధర' హో!

స్మార్ట్ మీటర్ల ధరను రాష్ట్ర ప్రభుత్వం రూ.9,000గా నిర్ణయించింది. ఇది సింగిల్‌ఫేజ్ ధరనే! త్రిఫేజ్ మీటరు ధర రెట్టింపు ఉంటుంది. ఈ మొత్తాన్ని వినియోగదారులు భరించాల్సిందే. వినియోగదారులు మీటరు ధరను ప్రతి నెలా వాయిదాల పద్ధతిలో చెల్లించాల్సి ఉంది. ఇవి కూడా ఆరేళ్ల మాత్రమే పనిచేస్తాయి. ఆ తర్వాత వినియోగదారులు నగదు చెల్లించి కొత్త మీటరు తీసుకోవాల్సి ఉంది. స్మార్ట్ మీటర్లు బిగించడంపై ప్రభుత్వ పెద్దలు విద్యుత్ అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నారు. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించేందుకు నెల వారీగా టార్గెట్‌లను కూటమి ప్రభుత్వం ఇస్తోంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తుండటంతో అధికారులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

గుండె గు'బిల్లు'

స్మార్ట్ మీటర్లు బిగించక ముందు కమర్షియల్ కనెక్షన్లకు విద్యుత్ బిల్లు రూ.3000 వచ్చేది. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత రూ.30,000కు పైగా బిల్లులు వస్తున్నాయి. విద్యుత్ అధికారుల వద్దకు వినియోగదారులు వెళ్తే ' మా చేతిలో ఏమీ లేదు' అని తేల్చి చెబుతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత రోజుకు నాలుగైదు సార్లు రీడింగ్ తీస్తారు. విద్యుత్ లోడ్‌ను బట్టి గంట, గంటకు బిల్లు రేట్లు మారుతాయి. విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే సమయంలో వాడితే చార్జీల మోత మోగుతుంది. ఉదయం ఒక రేటు, మధ్యాహ్నం ఒక రేటు, రాత్రి ఇంకోరేటు ఉంటుంది. సాధారణ, మధ్య తరగతి కుటుంబాలు జీవితకాలం కష్టపడి సంపాదించుకున్న మొత్తం విద్యుత్ బిల్లులకు సరిపోతుంది. స్మార్ట్ మీటర్లతో ప్రతి నెలా సాధారణ వినియోగదారునిపై రూ.500నుంచి రూ.800 వరకు అదనపు భారం పడుతోంది.

ముందుగానే రీచార్జ్ చేయాలి

మొబైల్ ఫోన్‌కు ముందుగా రీచార్జ్ చేయించుకునే విధంగానే స్మార్ట్ మీటర్లుకు కూడా రీచార్జ్ చేయించుకోవాలి. రీచార్జ్ అమౌంటు అయిపోతే విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ప్రస్తుతం ఉన్న మీటర్లు బాగా పనిచేస్తున్నాయి. పనిచేస్తున్న మీటర్లను పీకేసి ఆదాయాన్ని పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజల నడ్డివిరుస్తోంది.

బిల్లు కట్టాలంటే షాపును అమ్ముకోవాల్సిందే



కోడుమూరుకు చెందిన నాగేంద్ర ఆచారి కార్పెంటర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మే నెలలో కార్పెంట్ షాపునకు అధికారులు పాత మీటర్‌ను తొలగించి స్మార్ట్ మీటర్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఎప్పుడూ కార్పెంటర్ షాపునకు రూ.800లు మించి రాని కరెంట్ బిల్లు స్మార్ట్ మీటర్ ఏర్పాటు చేసిన 15 రోజులకే ఏకంగా రూ.18570 బిల్లు వచ్చింది. ఈ బిల్లును చూసిన నాగేంద్ర ఆచారి ఇంత కరెంట్ నేను ఎక్కడ కాల్చానో చెప్పి కరెంట్ బిల్లు కట్టించుకోవాలంటూ విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్నాడు. అయితే నాగేంద్ర ఆచారి సమస్యను పరిష్కరించని విద్యుత్ అధికారులు పాత బిల్లు కలుపుకుని (కొత్త బిల్లు రూ.7995లు) ఏకంగా రూ.25,565ల బిల్లును వేశారు. దీంతో బెంబేలెత్తిపోయిన నాగేంద్ర ఆచారి ఇంతింత కరెంట్ బిల్లులు కట్టాలంటే తాను షాపును అమ్ముకోవాల్సిందేనంటూ వాపోతున్నాడు.

వ్యాపారం మానుకోవాల్సిందే



కోడుమూరుకు చెందిన శ్రీనివాసులుకు బండల వ్యాపారం ఉండడంతో బండల కటింగ్ మిషన్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. గతంలో ఐదారువేలకు మించి రాని కరెంట్ బిల్లు స్మార్ట్ మీటర్ ఏర్పాటుతో జూన్ నెల రూ.14750లు వచ్చింది. దీంతో అప్పు చేసి గత నెల వచ్చిన కరెంట్ బిల్లును ఎలాగోలా కట్టుకున్నాడు. అయితే జూలై నెల ఏకంగా రూ.19993ల కరెంట్ బిల్లు రావడంతో బెంబేలెత్తిపోతున్నాడు. ఇప్పటికే వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే భారీగా వస్తున్న కరెంట్ బిల్లులను చూసి చేస్తున్న వ్యాపారం మానుకునే ఆలోచన చేస్తున్నానంటూ శ్రీనివాసులు వాపోయాడు.

జిల్లాలో ఇప్పటి వరకు బిగించిన స్మార్ట్ మీటర్ల వివరాలు...

కేటగిరి	బిగించాల్సిన స్మార్ట్ మీటర్లు	ఇప్పటి వరకు బిగించినవి
33కేవీ ఫీడర్	181	---
11కేవీ ఫీడర్	634	256
నాన్ అగ్రికల్చర్(డీటీఆర్)	6,969	391
ప్రభుత్వ సర్వీసులు	13,910	9,347
ఇండస్ట్రియల్	322	---
కమర్షియల్	93,189	55,247
డొమెస్టిక్ (200 యూనిట్లుపైబడి)	42,158	5,114
మొత్తం	1,57,263	70,355

ఎలా బతకాలి?

మేం వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాం. దీనికి కేటగిరి-2 విద్యుత్ కనెక్షన్ ఉంది. విద్యుత్ అధికారులు వద్దంటున్నా నాలుగు నెలల క్రితం బలవంతంగా స్మార్ట్ మీటరు బిగించారు. మొదటి బిల్లు కేవలం వారం రోజులకే రూ.10,000 వచ్చింది. తర్వాతి రెండు నెలలు రూ.30 వేలకుపైగా వచ్చాయి. స్మార్ట్ మీటరు బిగించక ముందు గరిష్టంగా రూ.3,000 వరకు మాత్రమే బిల్లు వచ్చింది. బిల్లులు భారీగా రావడంపై విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశాం. వచ్చే లాభం విద్యుత్ బిల్లులకే సరిపోతే ఎలా బతికేది అర్థం కావడం లేదు.

– ఉస్మాన్, వెల్డర్, అజిముద్దిన్‌నగర్, కర్నూలు

న్యూస్‌రీల్

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



దర్శనానికి క్యూ లైన్లలో వేచివున్న భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలో వెలసిన శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళగంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి క్యూ లైన్లలో బారులుదీరారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లు నిండి పోయాయి. వేచి ఉన్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు దేవస్థాన అధికారులు పంపిణీ చేశారు. భక్తుల శివ నామ స్మరణతో శ్రీశైల ఆలయం మారుమోగింది. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులు కళకళలాడుతున్నాయి.

కామేశ్వరీదేవికి సారె



చీర, సారె తీసుకొస్తున్న దృశ్యం

మహానంది: మహానంది క్షేత్రంలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి అమ్మవారికి శ్రీ బాలాజీ సేవా ట్రస్ట్ సభ్యులు ఆదివారం పుట్టింటి పట్టుచీర, సారె సమర్పించారు. కోలాటాలు, భజనలతో మహానందికి వచ్చిన శోభాయాత్రకు ఆలయ ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, అర్చకులు స్వాగతం పలికారు. ఈ మేరకు వారు ఆలయానికి చేరుకుని మహానందీశ్వరుడికి పట్టువస్త్రాలు, కామేశ్వరీదేవికి చీర, సారె అందజేశారు. మాడ వీధుల్లో చేపట్టిన కోలాటాలు, భజనలు, నృత్యాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించాయి. కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ట్రస్ట్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ధనుంజయరెడ్డి, అధ్యక్షుడు శ్రీకాంత్, ఆర్గనైజర్ శివమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1100ను సంప్రదించాలన్నారు. అలాగే అర్జీదారులు దరఖాస్తులను ప్రస్తుత సమాచారాన్ని meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో తెలుసుకోవడంతో పాటు తమ అర్జీలను కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. అర్జీదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు




భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఆత్మకూరు: పట్టణంలో నూతనంగా డీఎల్‌డీవో, డీఎల్‌పీవో కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు జెడ్పీఈ సీఈఓ నాసరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆత్మకూరు పట్టణానికి చేరుకున్న ఆయన స్థానిక ఎంపీడీఓ, సెరికల్చర్ కార్యాలయాలను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా కార్యాలయాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ఉమ్మర్, పంచాయతీ రాజ్ ఏఈ సుబ్బయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినోద్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

మహిళా జెడ్పీటీసీ సభ్యులకు 22 నుంచి శిక్షణ

కర్నూలు (అర్బన్): ఉమ్మడి జిల్లాలోని మహిళా జెడ్పీటీసీ సభ్యులకు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు డీపీఆర్సీ ప్రిన్సిపల్, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. మార్పు ద్వారా విజేతలు – సాధికారతతో సుపరిపాలన సాధ్యం' అనే అంశంపై ఈ శిక్షణను జెడ్పీ ప్రాంగణంలోని డీపీఆర్సీ భవనంలో ఇవ్వనున్నట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమానికి మహిళా జెడ్పీటీసీ సభ్యులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం



'బాబు ష్యూరిటీ అంటే మోసం గ్యారెంటీ'పై క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు

- సూపర్‌సిక్స్ అమలు చేయకుండానే సుపరిపాలన ఎలా?
- ప్రతి పక్ష హోదా ఇచ్చేందుకు కూటమి సర్కార్‌కు వణుకు
- మాజీ ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల

కోవెలకుంట్ల: సీఎం నారా చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీ వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో 'బాబు ష్యూరిటీ– మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎంగా ప్రతి సారి అబద్ధపు హామీలతోనే పాలన సాగిస్తారని విమర్శించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రధాన ప్రతి పక్ష పార్టీ అయినప్పటికీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు కూటమి సర్కార్‌కు భయం పట్టుకుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్‌సిక్స్‌తో పాటు మరో 143 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైతులకు అన్నదాత సుఖీభవ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ప్రతి మహిళకు నెలకు ఆడబిడ్డ నిధికి కింద రూ. 1,500 ఎందుకు ఇవ్వలేకపోతున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలు తెచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆ మెడికల్ కళాశాలల్లో కూటమి ప్రభుత్వానికి చేతకాక విద్యార్థులకు సీట్లు ఇవ్వలేకపోతోందన్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలను ప్రజాక్షేత్రంలోకి తీసుకెళ్లేందుకు శ్రీకారం చుట్టామన్నారు. కూటమి సర్కార్ మోసాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.

అక్రమ అరెస్ట్‌లతో భయపెట్టలేరు

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతోందని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు.. మద్యం కేసులో కూటమి సర్కార్ బరితెగింపు చర్యలకు పాల్పడటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మద్యం మాఫియా మూలవిరాట్టు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని, 2014–19 మధ్య కాలంలో యథేచ్ఛగా మద్యం కుంభకోణానికి పాల్పడ్డారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమ కేసు నమోదు చేడయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేదిలేదన్నారు. ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, గుండం సూర్యప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ షాజహాన్, మండల కో ఆప్షన్ మెంబర్ దిల్కాబాషా, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్, ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఎల్వీ సుధాకర్‌రెడ్డి, ఈర్నపాటి నాగేంద్ర, బాలమద్దిలేటి, మధుసూదన్‌రెడ్డి, పంచాయతీరాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు మల్లు హరినాథరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

'పట్టా'భిషేకం



ఉన్నత విద్యను పూర్తి చేసుకున్న ఆనందం.. తల్లిదండ్రులు చూస్తుండగా బీటెక్ పట్టాలను అందుకున్న ఉల్లాసం.. కర్నూలు ఐఐఐటీడీఎంలో ఆదివారం అట్టహాసంగా 'పట్టా'భిషేకం జరిగింది. స్నాతకోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఐఐఐటీడీఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ పద్మశ్రీ గ్రహీత ప్రొఫెసర్ విజయలక్ష్మీ దేశ్‌మానేతో కలసి విద్యార్థులు ఫోటో దిగారు.

- వివరాలు 8లో▸

కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దాం



ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామంటూ వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో గణేష్ నగర్, నాల్గవ తరగతి కాలనీలో కాటసాని, మేయర్ బీవై రామయ్య, నాయకులతో కలిసి 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'లో భాగంగా ఇంటింటికీ వంచన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది కాలంలో సంక్షేమ పథకాలు అందక ప్రతి కుటుంబం ఎంత నష్టపోయిందని అనే విషయాలను వివరించారు. – కల్లూరు

అక్రమ కేసులతో అణచివేయలేరు



ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీని అణచివేయలేరని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా అన్నారు. చంద్రబాబు అంతటి దివాలా కోరు రాజకీయ నాయకుడు మరెవరూ లేరని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో చరమగీతం పాడాలన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను వేధించడమే లక్ష్యంగా పనిగా పెట్టుకుందన్నారు. మద్యం కేసు అంటూ అక్రమ అరెస్ట్‌లు చేసినా ఎవరూ భయపడే ప్రసక్తి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు నూతన మద్యం పాలసీ తెచ్చి ప్రైవేటు వ్యక్తుల ప్రమేయం లేకుండా చేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చిందన్నారు. జగన్‌కు సన్నిహితంగా ఉంటున్నారని ఎంపీ మిథున్‌రెడ్డిపై కేసు పెట్టారని, ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా అక్రమంగా పెట్టిన ఈ కేసు చెల్లదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయకుండా చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

చిన్నారిపై పిచ్చి కుక్కదాడి

పాములపాడు: బానుముక్కల గ్రామంలో గడ్డం జయమ్మ అనే ఏడేళ్ల చిన్నారిపై ఆదివారం పిచ్చి కుక్క దాడి చేసింది. ఇంటి బయట ఆడుకుంటున్న చిన్నారిపై అందరూ చూస్తుండగానే దాడి చేసింది. కంటి పైభాగంలో తీవ్ర గాయమైంది. అక్కడే ఉన్న స్థానికులు పిచ్చికుక్కనే తరిమేశారు. గ్రామంలో పిచ్చి పట్టిన ఓ కుక్క సుమారు 20కి పైగా వీధి కుక్కలను కరిచిందని, అప్పటి నుంచి పిచ్చి కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.గాయపడిన చిన్నారిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

క్లుప్తంగా

శాస్త్రోక్తంగా పల్లకోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు పల్లకోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ పల్లకీ ఉత్సవం ప్రతి ఆదివారం, పౌర్ణమి మరియు మూలా నక్షత్రం రోజులలో (సర్కారి సేవగా) జరిపించబడుతోంది. కార్యక్రమంలో భాగంగా ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకులు సేవా సంకల్పాన్ని పఠించారు. అనంతరం శ్రీ స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఉంచి శాస్త్రోక్తంగా షోడశోపచారపూజలు చేపట్టారు.

నేటి నుంచి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయ విభాగం ఇక నుంచి వ్యవసాయ శాఖకు అనుబంధంగా పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో రైతు సేవ కేంద్రాల ఇన్‌చార్జీలకు కూడా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించనున్నారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు అన్ని వ్యవసాయ శాఖ డివిజన్ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మాధురి తెలిపారు. ఎంపిక చేసిన వీఏఏలకు మాత్రమే మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పిస్తారని, ఇందులో ఆయా మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొంటారని ఆదివారం ఓ ప్రకటనలో ఆమె వెల్లడించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: పెద్దతుంబళం గ్రామానికి చెందిన కురువ తిమ్మప్ప(29) విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సెంట్రింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించే తిమ్మప్ప ఆదివారం గ్రామంలో ఓ ఇంటి వద్ద పని చేస్తుండగా విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలో పడిపోయాడు. కుటుంబీకులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం పోలీసులు తెలిపారు. మూడేళ్ల క్రితం మృతుని భార్య అనారోగ్యంతో మృతి చెందింది. వీరికి సంతానం లేరు.

చిరుతల సంచారం

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల, మామిళ్లపల్లి శివారు ప్రాంతాల్లోని కొండ ప్రాంతాల్లో చిరుత పులులు సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కలచట్ల శివారు ప్రాంతంలోని రంగస్వామి కొండపై చిరుత సంచరిస్తోందని పశువుల కాపర్లు తెలిపారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు కలచట్ల గ్రామంలో ఆదివారం దండోరా వేశారు. చిరుత సంచరిస్తున్న కొండ ప్రాంతానికి పశువుల కాపర్లు వెళ్లకూడదన్నారు. అలాగే మామిళ్లపల్లి కొండపై ఆదివారం పులిపాటి రాజు అనే పశువుల కాపరికి చిరుత పులి కనిపించింది. ఈ విషయాన్ని తెలుసుకున్న పలు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చిరుత పులిని బంధించాలని ప్రజలు కోరుతున్నారు.

ట్యాంకర్ బోల్తా

కర్నూలు(రూరల్): ట్యాంకర్ డ్రైవర్ నిద్రమత్తులో వాహనం నడపడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని గార్గేయపురం శ్మశాన వాటిక వద్ద ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఆత్మకూరు నుంచి బళ్లారికి సిమెంట్ మిశ్రమంతో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆ సమయంలో ఇతర వాహనాలు రాక పోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తాలుక అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీధర్ తెలిపారు.

వర్షించని 'మధుర' ఆశలు!

- విక్రయాలు లేక వెలవెలబోతున్న మామిడి నర్సరీలు
- ఊపందుకోని మొక్కల విక్రయాలు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాయితీలు కరువు



డిపోలో ఉన్న మామిడి మొక్కలు



తల్లి అంటుకు ఉన్న మామిడి మొక్కలు

పాణ్యం: ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో రైతులు ఎవరూ మామిడి మొక్కలు కొనడం లేదు. దీంతో పాణ్యంలోని మామిడి నర్సరీలు వెలవెలబోతున్నాయి. ఇక్కడ 40కుపైగా నర్సరీల్లో మామిడి మొక్కలను సాగు చేస్తున్నారు. జూన్, జూలై, ఆగస్టు నెలలో నర్సరీలు రైతులతో కిటకిటలాడుతుంటాయి. అలాంటి ప్రసిద్ధి చెందిన నర్సరీలు నేడు వెలవెలబోతున్నాయి.

రెండు లక్షల మొక్కలకు పైగానే..

మామిడి (మధుర ఫలం) మొక్కలకు ప్రసిద్ధి పాణ్యం నర్సరీలు. ఇక్కడ తల్లి అంటు (అప్రోచ్ గ్రాఫ్టింగ్) నుంచి మొక్కలు తయారు చేస్తారు. ఇలా ఈ ఏడాది దాదాపుగా రెండు లక్షల మొక్కలకు పైగానే నర్సరీల్లో తయారు చేశారు. లక్షల పెట్టుబడులు పెట్టి మొక్కలను సాగు చేస్తే కొనేందుకు ఎవరూ రాకపోవడంతో ఏమి చేయాలో రైతులకు అర్థం కావడం లేదు. ఈ నర్సరీల్లో మామిడి రకంలోనే దాదాపుగా 40 రకాలకు పైగా ఉన్నాయని నర్సరీల రైతులు చెబుతున్నారు. అత్యధికంగా బేనీషన్, అమృతం, రెడ్డి పసంద్‌ను రైతులు ఇష్టపడతారు. ఈ ఏడాది దాదాపుగా 2లక్షల పైగానే మొక్కలు సిద్ధం చేసినప్పటికీ రైతులు రాక డిపోల్లో ఉంచారు.

వర్షాలు లేక..

సాధారణంగా మామిడి సాగు చేసుకునే రైతులు మార్చి, ఏప్రిల్ నెలలో నర్సరీలకు వస్తారు. అంటు తీరును పరిశీలించి తమకు కావాలని వెళ్తారు. తీరా వర్షాలు పడ్డాక జూన్ నెలలో మొదలు కొని జూలై, ఆగస్టు వరకు తీసుకెళ్తారు. అయితే వరుణదేవుడు కరుణించకపోవడంతో రైతులు మామిడి సాగుపై ఆసక్తి చూపలేదు. ఈ ఏడాది ఆశించిన వర్షాలు లేనందుకు విక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో పెంచి మొక్కల నిర్వహణ భారం మరింత పెరుగుతోందని రైతులు చెబుతున్నారు. పాణ్యం నర్సరీల నుంచి అధికంగా కర్ణాటక, హైదరాబాద్, తమిళనాడు తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేసేవారు.

రాయితీలు కరువు

నర్సరీ రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రాయితీలు అందడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు లైసెన్సులు అందించారు. అంతేగాక మామిడి సాగు చేసే రైతులకు ఉపాధి సిబ్బంది పాణ్యంలో నర్సరీల్లో మొక్కలను సూచించే వారు. కాని కూటమి ప్రభుత్వంలో నర్సరీలకు రాయితీలు ఇవ్వకపోగా మామిడి సాగు చేసే రైతులకు టెండర్ల ద్వారా ఇతర జిల్లాల నుంచి మొక్కలను సరఫరా చేస్తున్నారు. దీంతో పాణ్యం నర్సరీలు తీవ్రంగా నష్టపోతున్నాయి.

గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు



ఈ ఏడాది నేను 7వేలకు పైగానే మొక్కలను సిద్ధంగా ఉంచాను. ఇందుకు రూ. 5లక్షలకు పైగానే పెట్టుబడి వచ్చింది. వర్షాలు సరిగ్గా లేక మొక్కలు డిపోల్లోనే ఉండిపోయాయి. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు. ఎంతో జాగ్రత్తగా తల్లి అంటు ద్వారా అప్రోచ్ గ్రాఫ్టింగ్ మొక్కలు ఇక్కడ తప్ప ఎక్కడా దొరకవు. ప్రతి ఏడాది ఈ నెలలో సగానికిపైగా మొక్కలను అమ్ముకునే వాళ్లం, కాని ఇప్పటికీ 5 శాతం కూడా మొక్కలు అమ్మలేదు.
– జనపాల పెద్దన్న, నర్సరీ యజమాని

ఉపాధి పథకానికి అనుసంధానం చేయాలి



ప్రతి సంవత్సరం మామిడి మొక్కలు జూన్‌లో విక్రయాలు ప్రారంభమయ్యేవి. జూలై నాటికి నర్సరీల్లో మొక్కలు సగానికిపైగా అమ్ముడుబోయేవి. కాని ఈ ఏడాది మొక్కలు అమ్ముడుబోక నర్సరీల్లో ఉండిపోయాయి. ఉపాధి హామీ పథకానికి నర్సరీలో అనుసంధానం చేయాలి. మా నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు ఉన్నాయి. మామిడి సాగు చేసే రైతులకు పాణ్యం నర్సరీలో మొక్కలను సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇంతటి పరిస్థితి ఎప్పుడూ రాలేదు.
– రాము, నర్సరీ యజమాని

కుక్కను తప్పించబోయి..

- ఎల్లెల్సీలోకి దూసుకెళ్లిన కారు
- ఒకరు మృతి, మరొకరు గల్లంతు
- మరో నలుగురిని కాపాడిన స్థానికులు



సునీల్ మృతదేహం



కారును జేసీబీతో బయటకు తీస్తున్న దృశ్యం

కౌతాళం: వివిధ ప్రాంతాలకు చెందిన ఆరుగురు యువకులు ఓ కంపెనీలో పని చేస్తూ స్నేహితులుగా మారారు. ఆదివారం సెలవు కావడంతో క్షేత్రాల సందర్శనకు బయలుదేరారు. అయితే వారి విహార యాత్రలో విషాదం చోటు చేసుకుంది. కౌతాళం సమీపంలో ఆదివారం మధ్యాహ్నం ఎల్లెల్సీ కాల్వలోకి కారు దూసుకెళ్లిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గల్లంతయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం హుబ్లీ పట్టణంలో ఓ వాచ్ కంపెనీలో పని చేస్తున్న ఇటిగడ్డికి చెందిన హైదర్, గోకుల్ గ్రామానికి చెందిన అభిషేక్, సునీల్, బెళగేరికి చెందిన అప్పయ్య, మంజునాథ్, తారేహళ్లికి చెందిన మణికంఠ అందరూ 22 ఏళ్ల యువకులు. వీరంతా శ్రీ రాఘవేంద్ర స్వామి దర్శనానికి శనివారం రాత్రి కారులో బయలుదేరారు. ఆదివారం ఉదయం మంత్రాలయం చేరుకుని బృందావనాన్ని దర్శించుకున్నారు. అనంతరం కొప్పల్‌లోని గవి మఠాన్ని సందర్శించుకునేందుకు మధ్యాహ్నం కౌతాళం మీదుగా వెళ్తుండగా మార్గమధ్యలో లక్ష్మీనగర్ సమీపంలో ఎల్లెల్సీ వంతెన వద్ద కుక్క అడ్డు వచ్చింది. కుక్కను తప్పించబోయే ప్రయత్నంలో కారు ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. కారు డోర్‌లు ఓపెన్ చేసుకుని బయటపడిన యువకులు నీటి ప్రవాహానికి కొట్టుకు పోతుండగా అక్కడే ఉన్న లక్ష్మీనగర్‌కు చెందిన గౌట్టయ్య, గోవర్ధన్, రమేష్‌లు చీరలు, తాటి మట్ట సహాయంతో మంజునాథ్, అభిలాష్, అప్పయ్య, హైదర్‌ను కాపాడగలిగారు. సునీల్ (22), మణికంఠ (21) ప్రవాహంలో కొట్టుకు పోయారు. సమాచారం అందుకున్న ఆదోని ఫైర్ స్టేషన్ ఎస్ఐ వసంతకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది అక్కడికి చేరుకుని నీటిలో గాలించగా సునీల్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. కాగా మణికంఠ మృతదేహం లభించలేదు. ఎస్‌డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లు, రెస్క్యూ టీం, కౌతాళం తహసీల్దారు రజనీకాంత్‌రెడ్డి, సీఐ అశోక్‌కుమార్, ఎల్ఎల్‌సీ డీఈ షఫీ, ఏఈ ఈశ్వర్‌లు అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

సీమకు బాబు ద్రోహం



చేతులు ఎత్తి సంఘీభావం చెబుతున్న రాయలసీమ జిల్లా సాధన సమితి సభ్యులు

ఆదోని రూరల్: రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ఉత్తుత్తి మాటలు చెబుతూ ద్రోహం చేస్తున్నారని రాయలసీమ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి విమర్శించారు. పదవులు కావాలి కానీ రైతుల సమస్యలు పట్టవా అని ప్రశ్నించారు. ఆదోని పట్టణంలోని లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మండపంలో కర్నూలు జిల్లా జలసాధన సమితి సదస్సు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాయలసీమ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి హాజరై మాట్లాడారు. రాయలసీమలో వర్షపు నీటిని నిల్వ ఉంచుకోవడానికి చెరువులు, చిన్నచిన్న ఆనకట్టలు నిర్మించాలన్నారు. ఆలూరు నియోజకవర్గంలోని వేదావతి ప్రాజెక్టు పనులు చేపట్టాలన్నారు. పందికోన రిజర్వాయర్ నుంచి ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఆస్పరి మండలానికి హంద్రీ–నీవా నుంచి తాగునీరు అందించాలన్నారు. నగరడోణ రిజర్వాయర్ పనులు మొదలు పెట్టాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాను సస్యశ్యామలం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా జల సాధన సమితి కన్వీనర్ శేషాద్రిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు హలిగేర కేశం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, వేదావతి ప్రాజెక్టు కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి, సుజ్ఞానమ్మ, మనీ, శ్రీనివాసరెడ్డి, రామిరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'పట్టా'భిషేకం



ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్‌కు మెమొంటోను అందజేస్తున్న ఐఐఐటీడీఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ పద్మశ్రీగ్రహీత ప్రొఫెసర్ విజయలక్ష్మీ దేశ్‌మానే, ఐఐఐటీడీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్‌మూర్తి, రిజిస్ట్రార్ కె.గురుమూర్తి



ప్రమాణం చేస్తున్న ట్రిపుల్ ఐటీడీఎం విద్యార్థులు

- ట్రిపుల్‌ఐటీ డీఎంలో స్నాతకోత్సవం
- మొత్తం 178 మందికి డిగ్రీల ప్రదానం
- టాపర్లకు పట్టాలను అందజేసిన ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్



తల్లిదండ్రులతో ఆనందం..



గోల్డ్ మెడల్ అందుకున్న ప్రణయ్ సందీప్ పరివార్



గుమ్మ శ్రీ సౌగాంధిక



లావీస్ సింగ్



శ్రీవర్ధన్‌మూర్తి



ప్రతీబి



రాంబాబు దారా



తల్లిదండ్రులతో విద్యార్థిని

కర్నూలు(సెంట్రల్): కర్నూలు శివారులోని జగన్నాథగట్టుపై వెలసిన ఐఐఐటీడీఎం (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫాక్చరింగ్)లో ఏడో స్నాతకోత్సవాన్ని ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. బీటెక్ పట్టాలు అందుకున్న విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధువులతో సంతోషంగా గడిపారు. స్నేహితులతో సెల్ఫీలు తీసుకొని ముచ్చటించారు. బీటెక్ పట్టాలను చూసి మురిసిపోయారు. జీవితంలో అనుకున్నది సాధించడంతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. స్నాతకోత్సవ కార్యక్రమానికి ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, ఐఐఐటీడీఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ పద్మశ్రీ గ్రహీత ప్రొఫెసర్ విజయ లక్ష్మీ దేశ్‌మానే, ఐఐఐటీడీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్‌మూర్తి, రిజిస్ట్రార్ కె.గురుమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రాడ్యుయేట్లకు డిగ్రీలను ప్రదానం చేశారు. ఐఐఐటీడీఎంలో 2024–25లో మొత్తం 178 మంది విద్యాభ్యాసం పూర్తి చేశారు. వీరిలో నలుగురు పీహెచ్‌డీ, ఎంటెక్ సీఎస్‌లో 20మంది, బీటెక్ సీఎస్‌లో 69 మంది, బీటెక్ ఏఐ అండ్‌డీఏలో 50 మంది, బీటెక్ ఎలక్ట్రానిక్స్‌లో 39 మంది, బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్‌లో 21మంది ఉన్నారు.

గోల్డ్ మెడలిస్టులు వీరే...

2024–25 విద్యాసంవత్సరానికి కర్నూలు ఐఐఐటీడీఎంలో మొత్తం ఏడుగురు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఎంటెక్ విభాగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో టాపర్‌గా ప్రణయ్ సందీప్ పరివార్ నిలిచారు. బీటీఎస్ సీఎస్ఈలో లవీస్‌సింగ్, బీటెక్ ఏఐఅండ్ డీఏలో గుమ్మశ్రీ సౌగాంధిక, బీటెక్ ఈసీఈలో చెముడుపాటి వెంకట శ్రీవర్ధన్ మూర్తి, బీటెక్ ఎంఈలో ప్రతీబి టాపర్లుగా నిలిచి గోల్డ్ మెడల్స్ అందుకున్నారు.అన్ని బీటెక్ గ్రూపులకు కలసి టాపర్‌గా లవీసింగ్ నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. దురువాసల మాణిక్యాంబకు ఎండోమెంట్ గోల్డ్ మెడల్ లభించింది.

సువర్ణావకాశం...

2024–25 విద్యాసంవత్సరంలో కర్నూలు ఐఐఐటీడీఎంలో బీటెక్ పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లకు సువర్ణావకాశం లభించింది. గతేడాది క్యాంపస్ ఇంటర్వ్యూలేక విద్యార్థులు అల్లాడిపోయారు. డిగ్రీ పూర్తి చేసుకున్నా ఉద్యోగాలు లేకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. ఈ యేడాది క్యాంపస్ ఇంటర్వ్యూలు జరిగి దాదాపు 50 మందికిపైగానే ప్లేస్‌మెంట్లు లభించాయి. వీరిలో ఓ విద్యార్థికి ఏడాదికి రూ. 38 లక్షల ఉద్యోగం ఇన్ఫోసిస్‌లో లభించినట్లు తెలుస్తోంది. అంతేకాక క్యాంపస్ బయటకు వెళ్లిన విద్యార్థుల్లో కూడా చాలా మంది ఉద్యోగాలు సాధించారు.

రేషన్ బండి పాయే..టిఫిన్ బండి వచ్చే!

పత్తికొండ రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసేందుకు ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రేషన్‌బండ్లు కూటమి ప్రభుత్వం కక్షసాధింపుతో మాయమయ్యాయి. పత్తికొండలోని ఓ రేషన్ బండి ఇలా టిఫిన్ బండిగా మారిపోయింది. గత ప్రభుత్వంలో ఇంటింటికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీరు మాబు బండిలో ఇడ్లీ, పూరి, ఉగ్గాని, బజ్జీ, దోసెలు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన ఈబండిని చూసి ప్రజలు గత ప్రభుత్వ హయాంలో అందిన సేవలు గుర్తుచేసుకుంటూ నేడు అధికార కూటమి ప్రభుత్వ దుర్మార్గాలను చీదరించుకుంటున్నారు.



పత్తికొండలో టిఫిన్ బండిగా మారిన రేషన్ బండి

కూరగాయల వ్యాపారి ఆత్మహత్య



ఇసాక్ (ఫైల్)

ఆదోని అర్బన్: పట్టణంలోని నిజాముద్దీన్ కాలనీకి చెందిన ఇసాక్(46) అనే వ్యక్తి డిష్ వైర్లకు ఉరి వేసుకుని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇసాక్ కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజుల నుంచి మతిస్థిమితం సరిగా లేదు. ఖాజీపురం కాలనీ సమీపంలో డిస్ వైర్లకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నవోదయ విద్యాలయంలో అ'పూర్వ' సేవలు



ప్రిన్సిపాల్ పద్మావతితో పూర్వ విద్యార్థులు

ఎమ్మిగనూరురూరల్: తమను ఉన్నత స్థాయికి తెచ్చిన బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూత ఇస్తున్నారు. 2014 సంవత్సరం నుంచి అల్యూమినియం వెల్ఫేర్ అండ్ ట్రస్ట్ పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యాలయంలో స్టాచీవ్ ఏర్పాటు చేశారు. అలాగే పార్కును అభివృద్ధి చేశారు. ఆదివారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి 1987 మొదటి బ్యాచ్ నుంచి 2020 వరకు చదివిన 200 మంది పూర్వపు విద్యార్థులు హాజరయ్యారు. రక్తదానం చేసి సేవాభావాన్ని చాటుకున్నారు. పూర్వపు విద్యార్థులను విద్యాలయ ప్రిన్సిపాల్ ఇ. పద్మావతి అభినందించారు. అలాగే పూర్వపు విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను సన్మానించారు.

చాలా సంతోషం



విద్యాలయంలో చదువుకున్న వారంతా ట్రస్ట్‌గా ఏర్పడి సేవలకు ముందుకు రావటం చాలా సంతోషంగా ఉంది. నేను 7వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని. కర్నూల్‌లో కిడ్నీ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నాను. నా భర్త డాక్టర్ రవీంద్ర క్యాన్సర్ వైద్య నిపుణులుగా ఉన్నారు. విద్యాలయంలో క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాక్సిన్‌ను ఉచితంగా విద్యార్థులకు ఇచ్చాం. 9 నుంచి 16 సంవత్సరాల పిల్లలకు ఈ వ్యాక్సిన్ వేసుకోవచ్చు.
– డా.సాయివాణి, ఎండీ, డీఎం, నెఫ్రాలజీ

వంద సేవా కార్యక్రమాలు చేశాం



నేను నవోదయ విద్యాలయం ప్రారంభించిన 1987 మొదటి బ్యాచ్ విద్యార్థిని. పూర్వపు విద్యార్థులు ఒక ట్రస్ట్‌గా ఏర్పడి ఇప్పటి వరకు 100 సేవా కార్యక్రమాలు చేపట్టాం. విద్యాలయానికి సోలార్ వాటర్‌ను ఇవ్వటం, విద్యాలయంలో బాగా చదువుతున్న పేదవిద్యార్థులకు ఆర్థిక సాయం కూడా చేశాం. ఈ విద్యాలయంలో చదువుకోవటం వల్లే మేం ఈ స్థాయిలో ఉన్నాం.
– ఎస్.ప్రవీణ్‌కుమార్, జిల్లా జడ్జి రాజంపేట, అన్నమయ్య జిల్లా

అభివృద్ధి చేస్తాం



పూర్వపు విద్యార్థులందరూ విద్యాలయం అభివృద్ధికి సహకరిస్తున్నారు. నేను 7వ బ్యాచ్‌కు చెందిన విద్యార్థిని. మొదటి నుంచి చదువుకున్న పూర్వపు విద్యార్థులు 200 మంది దాకా వచ్చి వైద్య శిబిరాన్ని నిర్వహించాం. ట్రస్ట్ ద్వారా ఏమి కావాలన్నా చేస్తాం.
– నాగరాజు, డిప్యూటీ కమిషనర్(ఐఎస్ఆర్), హైదరాబాద్